క్లుప్తంగా

రాజరాజేశ్వరీదేవిగా గంగమ్మ



రాజరాజేశ్వరీదేవి అలంకారంలో దర్శనమిస్తున్న గంగమ్మ తల్లి

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని అనంతపురం గంగమ్మ తల్లి శనివారం రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్తీకమాసం ముగియడంతో ఆదివారం గంగమ్మ ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు రానున్నారని, ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. వేకువజాము నుంచే అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, చైర్మన్ రెడ్డయ్య తెలిపారు.

శాకంబరి అలంకారంలో భుజంగేశ్వరుడు



శాకంబరి అలంకారంలో భుజంగేశ్వరుడు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని భుజంగేశ్వర ఆలయం భుజంగేశ్వరుడికి శనివారం కార్తీక అమావాస్య పురస్కరించుకొని అన్నాభిషేకం, శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు స్వామికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా మండల పూజ



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

రామాపురం : మండల పరిధి నీలకంఠ్రావుపేటలో నూతనంగా నిర్మించిన అభయహస్త ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ఘనంగా మండల పూజ నిర్వహించారు. వేకువజామునే అర్చకులు మూలవిరాట్‌లకు అభిషేకాలు, అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆంజనేయస్వామిని ఆలయం చుట్టూ ఊరేగించారు.

అయ్యప్ప స్వాములకు భిక్ష



అయ్యప్ప స్వాములకు వడ్డిస్తున్న సయ్యద్ మస్తాన్

సుండుపల్లె : మండల కేంద్రానికి సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు దగ్గర ఎస్ఎస్ఎస్ ఫుడ్ ప్రొడక్షన్‌లో అయ్యప్ప స్వామి మాలాదారులకు సయ్యద్ మస్తాన్ శనివారం మధ్యాహ్నం భిక్షను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకులు ఎర్రపురెడ్డి అజయ్ రెడ్డి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పక్కా గృహాలను పరిశీలించిన ఎంపీడీఓ



పక్కా గృహాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయారావు

పెనగలూరు : మండలంలోని సింగారెడ్డిపల్లి లేఅవుట్స్‌లో నిర్మిస్తున్న పక్కా గృహాలను శనివారం ఎంపీడీఓ విజయారావు పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 30వ తేదీలోపు పక్కా గృహాలు పూర్తి చేయాలని కోరారు. ఆలస్యమైతే బిల్లులు రావని, వెంటనే స్లాబ్‌లు వేసుకొని, పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య సేవలను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి కొండయ్య

సంబేపల్లె : వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి కొండయ్య పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీ అడవికమ్మపల్లెలో ఏర్పాటు చేసిన 104 సేవలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ అన్ని వ్యాధులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తామన్నారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాత నెత్తిన బీమా భారం..!

- ప్రభుత్వ నిర్ణయంతో అవస్థలు
- లబోదిబోమంటున్న కర్షకులు

పంట	ఎకరా/బీమా ప్రీమియం	హెక్టార్లు
వరి	రూ.126	450
వేరుశనగ	రూ.96	1,400
టమాటా	రూ.1,600	1,350



గాలివీడులో సాగు చేసిన వరి

గాలివీడు : అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏటా రూ. 20 వేలు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆ హామీని విస్మరించింది. పైగా అదనంగా పంటల బీమా ప్రీమియం భారాన్ని కర్షకులపై మోపింది. అదనంగా జీఎస్టీ వసూలు చేయడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు.

జగనన్న ప్రభుత్వంలో..

జగనన్న ప్రభుత్వంలో రైతులు హాయిగా ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు రైతుల తరుపున ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి ఆదుకుంది. పెట్టుబడి సాయం పథకం ద్వారా రైతుల ఖాతాల్లో ఏటా రూ. 13,500 మొత్తాన్ని జమ చేస్తూ వచ్చింది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీన తరువాత పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా అన్నదాత సుఖీభవ పథకం ఊసేలేదు.

కల్లలైన రైతుల ఆశలు

ఖరీఫ్ సాగుకు రెండు నెలల ముందే కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తారని, తద్వారా పంటల సాగుకు ఎలాంటి ఢోకా ఉండదని రైతులు భావించారు. అయితే వీరి ఆశలను ప్రభుత్వం కల్లలు చేసింది. కనీసం రబీ సీజన్ నాటికైనా పథకాన్ని అమలు చేస్తారనుకుంటే అదీ లేకుండా చేశారు. పంటల సాగులో పెట్టుబడి ఖర్చులు పెరగడం, ప్రకృతి వైపరీత్యాలు, దిగుబడులు ఆశాజనకంగా లేకపోవడంతో అన్నదాతలు నష్టాల పాలవుతున్నారు. భరించలేని కొందరూ రైతులు వ్యవసాయాన్ని వదిలేసే పరిస్థితులు నెలకొన్నాయి. మరి కొందరు ఎలాంటి ప్రత్యామ్నాయం లేక కష్టమైనా, నష్టమైనా వ్యవసాయాన్నే నమ్ముకొని జీవిస్తున్నారు.

అన్నదాత ఆవేదన

ఈ ఏడాది రబీ సీజన్ నుంచి రైతులే బీమా ప్రీమియంను చెల్లించాలని కూటమి ప్రభుత్వం స్పష్టం చేసింది. బీమా ప్రీమియం చెల్లింపునకు ప్రభుత్వం డిసెంబర్ 15ను తుది గడువుగా ప్రకటించింది. అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్న రైతులకు ఇది పెనుభారంగా మారింది. దీంతో చాలా మంది బీమాకు దూరమవుతున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులే చెల్లించాలి



అన్నమయ్య జిల్లాలో వరి, వేరుశనగ, టమాటా పంటలకు సంబంధించిన ప్రీమియంను రైతులే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఆయా గ్రామాల రైతులు రైతు భరోసా కేంద్రాల్లో డిసెంబర్ 15లోగా ఇన్సూరెన్స్‌ను చెల్లించాలి. ప్రీమియం నమోదులో పొరపాట్లు జరుగకుండా వ్యవసాయశాఖ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలి.

-చంద్రనాయక్, జిల్లా వ్యవసాయశాఖాధికారి

ఆదుకోవాలి



కూటమి ప్రభుత్వం నిర్ణయంతో బీమాకు రైతులు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొంది. అన్నదాత సుఖీభవ పథకాన్ని అందించకుండానే బీమా పేరుతో కూటమి ప్రభుత్వం నిలువుదోపిడి చేయడం సమంజసం కాదు. రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

-వెంకటాద్రి, రైతు, గోరాన్‌చెరువు గ్రామం, గాలివీడు మండలం

ప్రభుత్వమే భరించాలి



గత ప్రభుత్వం తరహాలోనే పంటల బీమా ప్రీమియాన్ని ప్రస్తుత ప్రభుత్వమే చెల్లించాలి. ప్రీమియం చెల్లించి బీమా పొందాలంటే రైతులకు సాధ్యం కాదు. అప్పులు చేసి పంటను సాగు చేస్తున్న రైతులకు బీమా భారంగా మారుతుంది. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో రైతులకు ఇబ్బందులు పడుతున్నారు.

-ఎమ్.రెడ్డికుమార్, రైతు, అరవీడు, గాలివీడు మండలం

రైతులను ఆదుకోండి

వీరబల్లి : రైతులకు ఆదుకోవాలని వీరబల్లి మాజీ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గాలివీటి విజయభాస్కర్‌రెడ్డి, శనివారం రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో వంగిమల పంచాయతీ ప్రాంతంలో ఆఫ్ స్ట్రీమ్ లూప్ పంపు స్టోరేజ్ 1,800 మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్ ప్రాజెక్టును మంజూరు చేశారని తెలిపారు. అయితే ఈ ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులకు ఎకరాకు రూ. 15 లక్షలు నష్టపరిహారం ఇస్తామని ప్రకటించారని పేర్కొన్నారు. పరిహారానికి సంబంధించి ఇప్పటికే ఆస్త్రా గ్రీన్ ఎనర్జీ వెంటర్స్ ఇండియా సంస్థ దృష్టికి కూడా తీసుకెళ్లామని తెలిపారు. ఈ విషయాన్ని ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని విజయభాస్కర్ రెడ్డి చెప్పారు.

సామాజిక పింఛన్లు పంపిణీ

రాయచోటి టౌన్ : ఒకటో తేదీ ఆదివారం కావడంతో సామాజిక పింఛన్లు ఒకరోజు ముందుగానే శనివారం పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమం శనివారం ఉదయం రాష్ట్ర రవాణ, క్రీడల, యువజన శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అర్హులకు పింఛన్లు అందజేశారు. మొదటి సారిగా రాయుడు కాలనీ, మాసాపేట, కొత్తపేటలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సామాజిక పింఛన్లు 1వ తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



బాల గంగాధర్‌నాయుడు

గాలివీడు : జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎగువగొట్టివీడు జిల్లా పరిషత్ పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్న విద్యార్థి పి. బాలగంగాధర్ నాయుడు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు బి. శ్రీనువాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ 14 విభాగంలో పూతలపట్టులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బాల గంగాధర్ నాయుడు ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక కావడంతో ప్రధానోపాధ్యాయుడు జె.వెంకట్రామిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.



సుండుపల్లె: విద్యార్థిని బేబీని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, ఫిజికల్ డైరెక్టర్

సుండుపల్లె : మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్లస్–2 ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న జేబీ జాతీయ స్థాయి అండర్–17 సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జయన్న, ఫిజికల్ డైరెక్టర్ రవీంద్రరాజు, రాధారాణి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

హెచ్‌ఐవీని తరిమికొడదాం



విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు

చిన్నమండెం : ఒకరికొకరు అవగాహన పొందడం ద్వారానే హెచ్‌ఐవీని సమాజం నుంచి తరిమి కొట్టవచ్చునని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ నరసింహులు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో శనివారం ఎయిడ్స్‌పై అవగాహనా సదస్సును నిర్వహించారు. జాతీయ సేవా పథకం–1,2 విభాగాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అపరిచిత వ్యక్తులలో శారీరక సంబంధం, అపరిశుద్ధ రక్తదానం, సిరంజిల వినియోగంతో ఎయిడ్స్ వ్యాధి సంక్రమిస్తుందని చిన్నమండెం పీహెచ్‌సీ వైద్యాధికారి రాధిక తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు ధర్మారెడ్డి, శివ, చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓ నాగ నవీన్‌కుమార్, సుబ్బరాయుడు, రవిశంకర్, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

రాయచోటి (జగదాంబసెంటర్) : ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వారి ఆదేశాలతో అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మరియు ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ వారి సూచనల మేరకు పీసీఎస్ఎస్ టీఐ ఎన్‌జీఓ, ఎల్‌డబ్ల్యూఎస్ వారు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శనివారం రాయచోటి డైట్ కళాశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా అదనపు డీఎంహెచ్ఓ డా.శైలజ, డేమో అధికారి దేవసిరోమణి, న్యాయవాదులు ఖైరూన్, డైట్ ప్రిన్సిపాల్ కిరణ్మయి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ అలీహైదర్, పీసీఎస్ఎస్ పీడీ చెన్నారెడ్డి, లయన్స్‌క్లబ్ సభ్యులు సతీష్ పాల్గొన్నారు.

దెయ్యంలా వేషం.. రోడ్లపై బీభత్సం

రాజంపేట : అకస్మాత్తుగా దెయ్యం ప్రత్యక్షమైతే ప్రజలు ఏవిధంగా భయపడతారో, ప్రవర్తిస్తారో చూద్దామనుకున్నారు కొందరు పోకిరీ యువకులు. అనుకున్నదే తడవుగా దెయ్యాల వేషాధారణలతో రాత్రి వేళ రోడ్లపైకి వచ్చి స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

నందలూరు గ్రామంలో కొందరు ఆకతాయిలు దెయ్యాలు వేషాలు వేసుకొని దారిపోయేవారిని భయపెడుతున్నారు. అస్తిపంజరాలు, దెయ్యం వేషాలతో హడలెత్తించడం చర్చనీయాంశంగా మారింది. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి సౌమ్యనాథాలయంలో సమీపంలో శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో వెళుతుంటే దెయ్యం వేషధారణలో కొంతమంది భయపెడ్డారు. దీంతో ఆయన హడలెత్తిపోయాడు. రాత్రంతా భయంతోనే గడిపినట్లు బాధితుడు వాపోయారు. ఆకతాయిలు చేష్టలకు గుండెజబ్బు, బీపీ వ్యాధిగ్రస్తులు భయపడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని స్థానికులు అంటున్నారు. యువకులు ప్రవర్తిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా నందలూరు నుంచి టంగుటూరు, పొత్తపితో పాటు పలు గ్రామాలకు వాహనాదారులు ఈ మార్గంలో గుండా వెళుతుంటారు. పోలీసులు ఆకతాయిల చేష్టలను కట్టడి చేయాలని కోరుతున్నారు.

రహదారికి మోక్షం ఎప్పుడో?



బురదమయమైన రహదారి

పుల్లంపేట : మండల పరిధిలోని దళవాయిపల్లి నుంచి కేతరాజుపల్లికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. కొద్దిపాటి వర్షానికే రోడ్డు బురదమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం కేతరాజుపల్లి నుంచి దళవాయిపల్లి మీదుగా వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

విద్యార్థులకు చేయూత



విద్యార్థులతో బ్యాంక్ సిబ్బంది, ఉపాధ్యాయులు

రాయచోటి టౌన్ : పేద విద్యార్థులకు చేయూతనిస్తున్నట్లు రాయచోటి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ (ఏపీజీబీ)అసిస్టెంట్ మేనేజర్ పవిత్ర తెలిపారు. శనివారం ఓదివీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ప్రతిభ సాధిస్తున్న విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు విద్యాజ్యోతి పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబీ అసిస్టెంట్ మేనేజర్ యోశిత, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్, ఉపాధ్యాయులు శివారెడ్డి, కృష్ణారెడ్డి, ఈశ్వర్ నాయక్, ఏపీజీబీ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

తుపాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

పుల్లంపేట : ఫెంగల్ తుపాన్ పట్ల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీ ప్రసన్న సూచించారు. రాత్రి వేళల్లో వంకలు, వాగులు చూడటానికి ఎవరూ వెళ్లరాదన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. రైతులు వరి పంట కోతలను వాయిదా వేసుకోవాలని, అదే విధంగా కోసిన వరి పంటలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించడం గానీ కుప్పలు వేయడం గానీ చేయాలన్నారు.

వ్యర్థాల తొలగింపు



పంచలింగాల స్వామి ఆవరణంలో వ్యర్థాలను తొలగించిన కూలీలు

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లె గ్రామ సమీపంలోని లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్యపూజ స్వామి కోనలో శనివారం వ్యర్థాలను తొలగించామని ఆలయ సిబ్బంది చంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయం ఈఓ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్తీక మాసం వారోత్సవాల్లో భాగంగా శ్రీ నిత్యపూజ స్వామిని దర్శించుకున్న భక్తులు, పంచలింగాల వద్ద దాతలు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారన్నారు. దీంతో అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు పడేయడంతో ఆపరిశుభ్రత నెలకొందని పేర్కొన్నారు. అటవీశాఖ అనుమతితో వ్యర్థ పదార్థాలను తొలగించామని తెలిపారు.

పరామర్శ

రామాపురం : మండల పరిధిలోని రాచపల్లె గ్రామ సర్పంచ్ వెంకటరెడ్డి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి శనివారం కడప నగరం అక్కాయపల్లెలో నివాసముంటున్న వెంకటరెడ్డిని పరామర్శించారు. ఆరోగ్య ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. ఆయనతో పాటు మండల కన్వీనర్ జనార్దన్‌రెడ్డి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఐ రాజారెడ్డి బదిలీ

బి.కొత్తకోట: స్థానిక సీఐ కే.రాజారెడ్డి బదిలీ అయ్యారు. ఆయన ఇక్కడ బాధ్యతలు చేపట్టి నాలుగు నెలలు కూడా గడవక ముందే బదిలీ కావడం చర్చనీయాంశమైంది. ఈయనను రాయచోటి ఎస్‌బీ–3 సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడికి నూతన సీఐగా వైఎస్సార్‌జిల్లా పులివెందుల సీఐగా పనిచేస్తున్న జి.జీవన్ గంగనాథ్‌బాబు నియమితులయ్యారు.

కుల వివక్ష చూపితే చర్యలు

పెద్దతిప్పసముద్రం : సమాజంలో మనుషులంతా ఒక్కటేనని, ఎవరైనా కుల వివక్ష చూపితే చర్యలు తప్పవని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ధనంజనేయులు అన్నారు. శనివారం మండలంలోని కాట్నగల్లు హరిజనవాడలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అధికారులు దళితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో తాగునీటి సౌకర్యం, మురుగు కాలువల ఏర్పాటు, విద్యుత్ సమస్య అధికంగా ఉందన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారం కోసం ప్రత్యేక చొరవ చూపుతామని హామీ ఇచ్చారు. అనంతరం అగ్రిగోల్డ్ భూముల పట్టాలు, సాగు విషయంలో దళితులే ఒకరిపై మరొకరు వాదులాటకు దిగడంతో పోలీసులు కలుగజేసుకుని సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని హితవు పలికారు. డీటీతో పాటు ఆర్ఐ బాలాజీ, వీఆర్వో మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై గజగజ



హార్సిలీహిల్స్‌పై కురుస్తున్న మంచు

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై శనివారం రాత్రి చలి తీవ్రత పెరిగి సందర్శకులు గజగజ వణికిపోతున్నారు. తుపాను ప్రభావంతో మంచు అధికమైంది. వర్షం కురుస్తుండటం, చలిగాలులు వీస్తున్న కారణంగా చలి పెరిగింది. సందర్శకులు గదులకే పరిమితమయ్యారు. చలి తీవ్రత రాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజాము నాలుగు గంటల వరకు తీవ్రమవుతున్నదని స్థానికులు తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న రాజంపేట స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ శంకర్

రామాపురం : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని రాజంపేట స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ ఆకాంక్షించారు. శనివారం బిట్స్ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి యువ ఉత్సవాల్లో ప్రతిభ చాటిన విజేతలకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా పేరును జాతీయస్థాయిలో నిలబెట్టాలని సూచించారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన యువ ఉత్సవ్‌లో (ఇండియా 2047) అనే అంశంపై పెయింటింగ్ విభాగంలో మొదటి స్థానంలో వెన్నెల, ద్వితీయ స్థానంలో స్రవంతి, తృతీయ స్థానంలో రెడ్డి ఇషాంత్, కవిత్వం విభాగంలో మొదటి స్థానంలో సమీరా, ద్వితీయ స్థానంలో కార్తీక, తృతీయ స్థానంలో నిఖిత నిలిచారు. అలాగే మొబైల్ ఫోటోగ్రఫీ విభాగంలో సాయికిరణ్‌రెడ్డి, గౌతమి, రీతికారెడ్డి, డిక్లేమసిన్ విభాగంలో పూర్ణ ప్రియాంక, అమీనా, వంశీకృష్ణ, సైన్స్ ఎగ్జిబిషన్ మేళా గ్రూప్ విభాగంలో రూప బృందం, లక్ష్మీనాథ్ శర్మం బృందం, తరుణ్‌కుమార్‌గౌడ్ బృందం పోటీల్లో సత్తా చాటింది. కార్యక్రమంలో అధికారి మణికంఠ, స్టెప్ సీఈఓ సాయి, భాస్కర్ కళాశాల కరస్పాండెంట్ భాస్కర్, ప్రిన్సిపాల్ ఏ.సీ.ఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి : మహిళలకు అన్ని రంగాల్లో సమానహక్కులతో పాటు ఉచిత న్యాయ సహాయం పొందే అవకాశం భారత రాజ్యాంగం కల్పించిందని రాజంపేట స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ డాక్టర్ శంకర్ అన్నారు. శనివారం స్థానిక ఎంపీపీ సభాభవనంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మెజిస్ట్రేట్ మాట్లాడుతూ మహిళలకు చట్టపరంగా ఉన్న హక్కులు, కుటుంబ విలువలు గురించి వివరించారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ విలువలు గురించి పిల్లలకు తెలియజేస్తే చాలా వరకు విడాకుల సమస్యలు రావన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్, తహసీల్దార్ మోహన్ కృష్ణ, ఎస్ఐ రఘురాం, అడ్వకేట్లు శ్రీనివాసులు, రమణ, ఈఓపీఆర్‌డీ శివకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసుందరమ్మ, ఏపీఓ చంద్రకళ పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణతో ఉపాధి గ్యారంటీ



యువకులకు సర్టిఫికేట్‌లు అందజేస్తున్న ప్రిన్సిపాల్

రైల్వేకోడూరు అర్బన్ : నిరుద్యోగ యువతీయువకులకు నైపుణ్య శిక్షణతో గ్యారంటీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాస్కర్‌రెడ్డి తెలిపారు. రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్ సెంటర్‌లో శనివారం నుంచి కొత్త బ్యాచ్‌కు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, పీఎం కౌశల్ వికాస్ యోజన ఆధ్వర్యంలో యువతీయువకులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులకు కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

జగదీశ్వర్‌రెడ్డిని పరామర్శించిన ఆకేపాటి



జగదీశ్వర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆకేపాటి జగదీశ్వర్‌రెడ్డి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఆయనను వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి శనివారం పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట రాజంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ త్రినాథ్, సౌమ్యనాథ స్వామి ఆలయ మాజీ చైర్మన్ అరిగె సౌమిత్రి, గీతాల నరసింహారెడ్డి, గుండు మల్లికార్జునరెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, ఆనాల మధు యాదవ్, మధురాజు, గంగయ్య, నవాబ్, రమేష్ రెడ్డి, ఆది తదితరులు పాల్గొన్నారు.